క్లుప్తంగా

ఆటో డ్రైవర్ల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవర్లు

పెనుగొండ: ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం వల్ల ఆటో డ్రైవర్ల జీవనోపాధి దెబ్బతింటుందని ఆటో డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం సిద్ధాంతంలో రాజరాజేశ్వరి ఆటోయూనియన్, వశిష్టా ఆటోయూనియన్ల ఆధ్వర్యంలో సిద్ధాంతం కచేరీ సెంటర్‌లో నిరసర వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్లకు సత్వరం ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.

కుంగుతున్న గోదావరి గట్టు రోడ్డు



ధ్వంసమైన గోదావరిగట్టు రోడ్డు

నరసాపురం: పట్టణంలోని గోదావరి గట్టు రోడ్డు ధ్వంసమవుతోంది. పడవలరేవు నుంచి కొండాలమ్మగుడి వరకూ రోడ్డుకు పలు చోట్ల గోతులు పడ్డాయి. అలాగే రోడ్డు చాలా చోట్ల కంగిపోయింది. దీంతో రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డు మీదుగా నిత్యం వేలాదిమంది ప్రయాణిస్తుంటారు. ముఖ్యంగా వార్నింగ్ వాక్ చేసేవారితో పాటు సాయంత్రం వేళలో గోదావరి తీరానికి విహారానికి పెద్దసంఖ్యలో జనం వస్తుంటారు. రోడ్డు సవ్యంగా లేకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు ఇంత అధ్వానంగా ఉన్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా ఈ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు రాష్ట్రస్థాయి పాటల పోటీలు

నరసాపురం: పట్టణంలోని వలందర్‌రేవు వద్ద శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవాల్లో భాగంగా మదర్‌థెరిస్సా దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పాటల పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు గురువారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయని, విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య వేడుకలు

నరసాపురం: నరసాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న పార్టీ కార్యాలయంలో స్వాతంత్ర్య వేడుకలు నిర్వహిస్తున్నట్టు పార్టీ పట్టణ అధ్యక్షుడు కామన బుజ్జి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9.30 గంటలకు పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం కాలినడకన ర్యాలీగా వెళ్లి శివాలయం సెంటర్ వద్ద ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

భవానీప్రసాద్‌కు నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు



భవానీప్రసాద్

పాలకొల్లు సెంట్రల్: విద్యా రంగానికి అందిస్తున్న సేవలకు గానూ స్థానిక జీవీఎస్‌వీఆర్ఎం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాయపూడి భవానీప్రసాద్ నేషనల్ ఎక్సలెన్స్ అవార్డ్‌కు ఎన్నికయ్యారు. ఈ మేరకు గురువారం పారాచూట్ వరల్డ్ రికార్డ్స్ ఇండియన్ చీఫ్ దాసరి స్వప్న మెయిల్ ద్వారా సమాచారం అందించారని తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ ప్రముఖులు, వివిధ రాజకీయ నాయకులు భవానీప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.

సిద్ధాంతం సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం

పెనుగొండ: సిద్ధాంతం సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యులు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. కమిటీ చైర్మన్‌గా కొరు శ్రీరామమూర్తి, డైరక్టర్లుగా మరో ఇద్దరు బాధ్యతలు స్వీకరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

భీమవరం: భీమవరం వన్‌టౌన్ పరిధి తాడేరు రోడ్డులో ఈ నెల 11న జరిగిన రోడ్డు ప్రమాదంలో సీహెచ్ లీలా వెంకట శివరామ్ గాయపడినట్లు పోలీసులు తెలిపారు. తాడేరు నుంచి ద్విచక్రవాహనంపై వస్తుండగా వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టిందన్నారు. గాయపడిన యువకుడు విజయవాడలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. అక్కడి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఎస్సై ఎస్. కృష్ణాజీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

ముస్తాబవుతున్న గణనాథులు

- ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలే అధికం
- ఆకట్టుకుంటున్న డిజైన్లు

భక్తులతో పూజలందుకునేందుకు బొజ్జ గణపయ్య సిద్ధం అవుతున్నాడు. వినాయక విగ్రహ తయారీదారులు విగ్రహాలకు తుది మెరుగులు దిద్దే పనిలో నిమగ్నమయ్యారు. అలాగే ఉత్సవ నిర్వాహకులు కూడా ఈ నెల 27 నుంచి నిర్వహించే ఉత్సావాలకు ఇప్పటికే విగ్రహాలను బుక్ చేసుకుంటున్నారు. ముఖ్యంగా పాలకొల్లు పట్టణంలో ప్రతి ఏడాది సుమారు 350 నుంచి 400 విగ్రహాల వరకూ విక్రయిస్తుంటారు. మూడు అడుగుల నుంచి 13 అడుగుల ఎత్తు వరకూ విగ్రహాలు తయారుచేస్తున్నారు. వీటి ధర రూ. 2500 నుంచి రూ 50 వేలు వరకూ ఉంటుంది. పాలకొల్లు పట్టణం, చుట్టుప్రక్కల గ్రామాల నుంచే కాకుండా నరసాపురం, మొగల్తూరు, తూర్పుగోదావరి జిల్లా రాజోలు, మల్కిపురం ఇలా పక్క జిల్లాల నుంచి వచ్చి ఇక్కడ విగ్రహాలకు ఆర్డర్లు ఇస్తుంటారు. అలాగే పెనుగొండ, సిద్ధాంతంలో ఎన్నో ఏళ్లుగా విగ్రహాలను విక్రయిస్తున్నారు.


–పాలకొల్లు సెంట్రల్/పెనుగొండ



అర్ధనారీశ్వర గణపతి



పెనుగొండ ఖార్కానాలో గణపతి ప్రతిమలు



నెమలి వాహనంపై బొజ్జ గణపయ్య



ఆకర్షిస్తున్న గరుడ గణపతి



పెనుగొండలో సిద్ధమవుతున్న భారీ గణపతి ప్రతిమలు



పెనుగొండలో విక్రయానికి సిద్ధంగా ఉన్న గణపతి విగ్రహాలు



ఆకట్టుకుంటున్న రామావతార గణపతి విగ్రహాలు



పూర్తి అయ్యే దశలో ఉన్న మహా గణపతులు

ముంపులోనే ఎంపీడీఓ కార్యాలయం



జలదిగ్బంధంలో ఉన్న పెనుగొండ ఎంపీడీవో కార్యాలయం



ముంపునకు గురైన వరి చేలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి స్పందన

పెనుగొండ: వర్షపు నీటి ముంపులో పెనుగొండ ఎంపీడీఓ కార్యాలయం చిక్కుకుంది. బుధవారం రాత్రి వరకూ ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షంతో పెనుగొండ పరిసర ప్రాంతాల్లోకి వర్షపు నీరు భారీగా చేరుకొంది. కొన్ని ప్రాంతాల్లో గురువారం ఉదయానికి వర్షపు నీరు వెళ్లిపోయినా, పెనుగొండ ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ వర్షపు నీరు నిలిచిపోయింది. ఎటూ వెళ్లే మార్గం లేకపోవడంతో మోకాలి లోతు నీటిలోనూ అధికారులు రాకపోకలు సాగించారు. ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగాణంలోనే వ్యవసాయాధికారి, ఎంఈవో కార్యాలయం ఉంది. మూడు కార్యాలయాల సిబ్బంది గురువారం ఇబ్బందులకు గురయ్యారు. మోకాలి లోతు నీటిలో వెళ్లడానికి నానావస్థలు పడ్డారు. ముఖ్యంగా క్యారాలయాన్ని డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేకుండా పోయింది. ఉన్నతాధికారులు సమస్య పరిష్కారానికి డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటుకు సన్నాహాలు చేయాలని స్థానిక అధికారులు కోరారు.

ముంపు చేలను పరిశీలించిన వ్యవసాయాధికారి

గత రాత్రి కురిసిన భారీ వర్షానికి ముంపుకు గురైన వరి చేలను పెనుగొండ మండల వ్యవసాయాధికారి పి.స్పందన గురువారం పరిశీలించారు. మండలంలో ముంపుకు గురైన వరిచేలను పరిశీలించి, ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని తెలిపారు. ఇప్పుడే ఊడ్చిన వరిచేలు 3 రోజుల పాటు ముంపుకు గురైతే నీటిని పూర్తిగా బయటకు తీసివేసి, పైపాటుగా ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరెట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలన్నారు. ఈ విధంగా బూస్టర్ డోస్ వేసుకోవడం వలన మొక్క ముంపు ప్రభావం నుంచి త్వరగా కోలుకొంటుందన్నారు. మొక్క కోలుకున్న అనంతరం, కుళ్లు తెగులు రాకుండా లీటరు నీటికి గ్రాము కార్బండిజం కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు.

ఆకట్టుకుంటున్న విద్యుత్ దీపాల అలంకరణ



ఆచంట పంచాయతీ కార్యాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించిన దృశ్యం

పెనుగొండ: స్వాతంత్ర్య వేడుకలకు ఆచంట పంచాయతీ కార్యాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. పంచాయతీని మువ్వెన్నెల జెండా రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించడంతో మూడు రంగులతో మెరిసిపోతుంది. అంతేగాకుండా దేశభక్తి పెంపొందించే విధంగా పంచాయతీ ఆవరణను సైతం సిద్ధం చేశారు. శుక్రవారం పంద్రాగష్టు వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

కోడిగుడ్డు, నిమ్మరసం ద్రావణం తయారీ



పాలకొల్లు సెంట్రల్: కోడిగుడ్డు, నిమ్మరసం ద్రావణం తయారీలో పాల్గొన్న వ్యవసాయ అధికారులు



యలమంచిలి: గుంపర్రులో కోడిగుడ్డు, నిమ్మరసం ద్రావణం తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

పాలకొల్లు సెంట్రల్: కోడిగుడ్డు, నిమ్మరసం ద్రావణం పంటలపై పిచికారి చేస్తే పంటకు ఎదుగుదల మెరుగుపడడమే కాకుండా సూక్ష్మ దాతు లోపాలను సైతం సరి చేయడంలో సహాయపడుతుందని వ్యవసాయ శాఖ జిల్లా కోఆర్డినేటర్ అరుణ కుమారి అన్నారు. గురువారం మండలంలోని చింతపర్రు గ్రామంలో కోడిగుడ్డు, నిమ్మరసం ద్రావణం సమూహంగా తయారు చేశారు. ఈ సందర్భంగా అరుణకుమారి మాట్లాడుతూ ద్రావణం తయారు చేసిన 15 రోజుల తర్వాత పావుకేజీ బెల్లం జోడించి సాయంత్రం సమయంలో ఎకరానికి 250 ఎంఎల్ ద్రావణం పంటపై పిచికారీ చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో డివిజనల్ ఇంచార్జ్ అప్పారావు, ఎంఎంటీఎల్ మురళి తదితరులు పాల్గొన్నారు.

గుంపర్రులో..

యలమంచిలి: కోడి గుడ్డు నిమ్మరసం ద్రావణం వరి పంటలో మొక్కకు కావాల్సిన ప్రోటీన్లు అందజేస్తుందని మండల వ్యవసాయ శాఖ అధికారి బాల త్రిపుర సుందరి చెప్పారు. ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం గుంపర్రు గ్రామంలో రైతులతో ఆమె సామూహికంగా కోడిగుడ్డు, నిమ్మసరం ద్రావణాన్ని తయారు చేయించారు. ఎకరానికి 250 మిల్లీ లీటర్ల మందు ద్రావణాన్ని 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చెయ్యాలని ఆమె చెప్పారు. కాయగూరలు మొక్కలకు కూడా ఈ ద్రావణం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎ.జ్యోతి, జడ్డు లక్ష్మీనారాయణ, బి.లక్ష్మీదుర్గ, ఆర్.లీలేశ్వరుడు పాల్గొన్నారు.

పొలమూరు –నవుడూరు రోడ్డుకు మోక్షం ఎప్పుడో?



బురదమయంగా ఉన్న పొలమూరు-నవుడూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు



పొలమూరు నవుడూరు రోడ్డులో పడిపోయిన ద్విచక్ర వాహనం (ఫైల్)

పెనుమంట్ర: పెనుమంట్ర–వీరవాసరం ఆర్ అండ్‌బీ రోడ్డులో పొలమూరు-నవుడూరు గ్రామాల మధ్య రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రోడ్డులో వర్షం వస్తే వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు వాహనాలు అదుపు తప్పి జారిపడుతుండడంతో అనేకమంది క్షతగాత్రులవతున్నారు. వర్షం వస్తే కార్ల నుంచి చిందే బురద దిచక్ర వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తుంది. ద్విచక్ర వాహనాలపై వివిధ కార్యక్రమాలకు వెళ్లే మహిళ ప్రయాణికులకు బురద మీద పడుతుండడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలమూరు హాస్టల్ నుంచి నవుడూరు సెంటర్ వరకు సుమారు కిలోమీటర్ పొడవు ఉన్న ఈ రోడ్డు కు శాశ్వత మరమ్మతులు చేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బీటీ రోడ్డుగా నిధులు మంజూరు చేసి పనులను ప్రారంభించారు.

ఎన్నికల కోడ్‌తో నిలిచిన పనులు

పొలమూరు హాస్టల్ నుంచి 500 మీటర్లు సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేసి మరో 500 మీటర్లు తారు రోడ్డు నిర్మాణ పనులు జరుగుతుండగా ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో సుమారు 400 మీటర్ల రోడ్డు పూర్తి చేసిన అధికారులు మిగిలిన రోడ్డు పనులను నిలిపి వేశారు. తదుపరి వచ్చిన ప్రభుత్వం రోడ్డు పనులను పూర్తి చేయకుండా తాత్కాలిక మరమ్మతులే చేయడంతో అది మున్నాళ్ల ముచ్చటగా తయారైంది. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని వాహనాదారులు డిమాండ్ చేస్తున్నారు.

బార్ల ఏర్పాటుకు విధివిధానాల విడుదల

పాలకొల్లు సెంట్రల్: బార్ల ఏర్పాటుకు సంబంధించిన విధివిధానాలను ఎక్సైజ్ సీఐ ఎం.శ్రీనివాసరావు గురువారం విడుదల చేశారు. పట్టణ పరిధిలో 2025–28 వరకు మూడు సంవత్సరాలు బార్ల ద్వారా మద్యం అమ్మకాలు చేసేందుకు లాటరీ ద్వారా వీటిని కేటాయించనున్నట్టు తెలిపారు. పాలకొల్లు మునిసిపల్ పరిధిలో ఉన్న 6 బార్లకు ఓపెన్ కేటగిరిలో ఏ 4 షాపులు ఎలా కేటాయించారో అదేవిదంగా బార్లను కూడా కేటాయిస్తామని పేర్కొన్నారు. అన్ని బార్లు లాటరీ ద్వారా కేటాయిస్తామన్నారు. గీత కులాలకు కేటాయించే బార్లను ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా లాటరీ తీస్తామన్నారు. ఒక వ్యక్తి ఎన్ని అప్లికేషన్‌లైనా వేసుకోవచ్చని, ఎన్ని బార్లు తగిలినా వాటిని కొనసాగించుకోవచ్చని తెలిపారు. ప్రతీ బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు వస్తేనే డ్రా తీస్తామని స్పష్టం చేశారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు రూ. 5 లక్షలు ఫీజు చెల్లించి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ మోడ్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అలాగే లైసెన్స్ గడువు 1 సెప్టెంబర్ 2025 నుంచి 31 ఆగష్టు 2028 వరకూ ఉంటుందన్నారు. సంవత్సరానికి ఎక్సైజ్ ట్యాక్స్ రూ. 55 లక్షలు చెల్లించాలని, ప్రతీ సంవత్సరం 10 శాతం ఫీజు పెరుగుతుందని పేర్కొన్నారు. గీత కులాల వారికి కేటాయించే బార్లు ఫీజు 50 శాతం మాత్రమేనని అంటే రూ. 27.5 లక్షలు వసూలు చేస్తామని, 10 శాతం ఫీజు పెంపు మాత్రం మామూలుగానే ఉంటుందన్నారు. ఆయా నిబంధనలకు అనుగుణంగా త్వరలో నోటిఫికేషన్ ఇస్తారని తెలిపారు.

CHANGE OF NAME

I, **PITTA RAJ KUMAR** (NEW NAME) S/O **DEVADASU** Previously called **PITTA RAJA KUMAR** (Old Name), Resident of 24-2-6, SAMBHUNI PETA, PALAKOL W.G.Dist., A.P. 534260, Now Changed my name from **PITTA RAJA KUMAR** (Old Name) to **PITTA RAJ KUMAR** (New Name). Hence forth I will be called as **PITTA RAJ KUMAR** (New Name) for all purpose.